సాక్షి
రాజన్న సిరిసిల్ల
బుధవారం । 12 । మార్చి । 2025

కనులపండువగా నృసింహుని కల్యాణం

ధర్మపురి:ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం రాత్రి స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనున్న శ్రీమతం స్థలంలో స్వామివారల కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, జిల్లాల నుంచి సుమారు 30వేల వరకు భక్తులు తరలివచ్చారు.

8లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం (సా॥)	సహర్ గురువారం (ఉ॥)
కరీంనగర్ :	6.27	5.06
పెద్దపల్లి :	6.31	5.05
సిరిసిల్ల :	6.26	5.15
జగిత్యాల :	6.31	5.05

న్యూస్‌రీల్

సమస్యలు పరిష్కరించాలని వినతి



జడ్జి రాజేశ్వర్‌రావుతో బార్ అసోసియేషన్ బాధ్యులు

వేములవాడ: వేములవాడ కోర్టులో నెలకొన్న న్యాయవాదుల సమస్యలను పరిష్కరించాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గుడిసె సదానందం ఆధ్వర్యంలో న్యాయవాదులు రాజన్న సిరిసిల్ల జిల్లా పోర్ట్ పోలియో జడ్జి నామవరపు రాజేశ్వరరావును మంగళవారం హైకోర్టులో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సదానందం మాట్లాడుతూ, వేములవాడకు అడిషనల్ కోర్టు మంజూరు చేయాలని, తదితర సమస్యలపై జడ్జికి వివరించినట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రజనీకాంత్, న్యాయవాదులు నక్క దివాకర్, పంపరి శంకర్, గుజ్జే మనోహర్ ఉన్నారు.

వివరాలు పక్కాగా నమోదు చేయాలి



స్కానింగ్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న డాక్టర్ల బృందం

సిరిసిల్ల: రికార్డుల్లో స్కానింగ్ వివరాలు పక్కాగా నమోదు చేయాలని ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని స్పష్టం చేశారు. స్కానింగ్ సెంటర్లలో రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో డాక్టర్లు రాజ్‌కుమార్, శీలాశిరీష, హెచ్‌ఈ బాలయ్య, ఉమెన్ వెల్ఫేర్ దేవిక, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్లకల్చరల్: ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రెండో విడతలో దరఖాస్తు చేసుకునే గడువు ఈ నెల 31 వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన విద్యార్థులకు ప్రతి నెలా రూ.5వేల భత్యం అందజేస్తారని పరిశ్రమల శాఖ సంచాలకుడు డాక్టర్ జి.మల్సూర్ తెలిపారు. ఏడాది పాటు సాగే ఇంటర్న్‌షిప్‌లో ఆరునెలల పాటు ఉద్యోగ శిక్షణ ఉంటుందన్నారు. 21 నుంచి 24 ఏళ్ల వయస్సు, పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ వంటి విద్యార్హతలు ఉండి, వార్షికాదాయం రూ.8లక్షల లోపు ఉన్న వారు దరఖాస్తుకు అర్హులుగా పేర్కొన్నారు. pminternship. mca. gov. in అభ్యర్థులు తమ వివరాలు పొందుపరచాలని, మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ 18001 16090 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు.

విద్యారంగానికి నిధులు కేటాయించాలి



సమావేశంలో విద్యార్థి సంఘాల నాయకులు

సిరిసిల్లటౌన్: రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించగా వక్తలు మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో పెండింగ్ స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలుచేసి ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలన్నారు. లేకుంటే సమస్యల పరిష్కారం కోసం అన్ని సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు గుండెల్లి కళ్యాణ్‌కుమార్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పర్కాల రవీందర్, జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి నాగరాజు, ఐద్వా జిల్లా కార్యదర్శి జవ్వాజి విమల, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ముశం రమేశ్, మల్లారపు ప్రశాంత్, జాలపల్లి మనోజ్‌కుమార్, గర్ల్స్ కన్వీనర్ సంజన, సాయిభరత్, శ్రీధర్, తల్లిదండ్రుల సంఘం నాయకులు సత్యం, రవి, తదితరులు పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ అయ్యేనా?

- ఈనెలాఖరు వరకు గడువు
- 42,942 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు
- ఫీజులో 25 శాతం రాయితీ
- ప్రాసెస్‌లో 34,229 అర్జీలు



మొర్రాయిపల్లిలో లేఅవుట్

ముస్తాబాద్(సిరిసిల్ల): అనధికార లేఅవుట్లు, అనుమతులు లేని ప్లాట్ల క్రమబద్ధీకరణకు స్పందన లభించడం లేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏడాదిగా ఎల్‌ఆర్‌ఎస్ అర్జీలను క్రమబద్ధీకరించేందుకు చేపట్టిన ప్రక్రియ అనుకున్న స్థాయిలో ముందుకు సాగడం లేదు. దీంతో ప్రభుత్వం ఈనెల 31లోగా ప్లాట్ల క్రమబద్ధీకరణకు గడువు విధించింది. గడువులోగా ఫీజులు చెల్లించిన వారికి 25శాతం రాయితీ ప్రకటించింది. దీనిపై ప్లాట్ల యజమానుల నుంచి ఎలాంటి స్పందన వస్తుందో చూడాలి.

దరఖాస్తుల వడబోత

జిల్లాలో గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు ఆహ్వానించగా రూ.వెయ్యి చెల్లించినవారు 42,942 మంది ఉన్నారు. వీరి పూర్తి వివరాలను ప్రస్తుతం అధికారులు వడబోసి అందరికీ సమాచారం అందించారు. అందులోంచి 34,229 దరఖాస్తులకు ప్రాసెస్ మొదలు పెట్టారు. వీరి ప్లాట్లను రెగ్యులర్ చేసేందుకు ఫీజు చెల్లించేలా గ్రామపంచాయతీ కార్యదర్శి, మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఈమేరకు లేఅవుట్ స్థలాలను కొనుగోలు చేసిన వారికి సిబ్బంది, ఉద్యోగులు ఫోన్‌లో సమాచారం ఇస్తున్నారు. 25 శాతం రాయితీతో ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని చెబుతున్నారు. 2020లో చేసుకున్న దరఖాస్తుదారులు తమ ప్లాట్లను విక్రయించినా, రిజిస్ట్రేషన్ సమయంలో ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించినా సరిపోతుందనే అవకాశం ఇచ్చారు. దీనిపై సందేహాల నివృత్తికి టోల్‌ఫ్రీ నంబర్ 18002331495 ఏర్పాటు చేశారు.

క్రమబద్ధీకరణపై నిఘా

ఎల్‌ఆర్‌ఎల్‌లో వచ్చిన దరఖాస్తులపై అధికారులు ఆచితూచి అనుమతులు ఇస్తున్నారు. చెరువులు, కుంటలకు 200 మీటర్లలోపు ఉన్న వాటిని రెగ్యులర్ చేయరు. అలాగే బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్, నీటివనరులు, వాగులు, నదుల వద్ద ఉన్న ప్లాట్లను క్రమబద్ధీకరించే సమయంలో పూర్తిస్థాయి విచారణ చేస్తున్నారు. జిల్లాలో ఉన్న లేఅవుట్లలో ఎన్ని డీటీసీపీ అనుమతులు పొందాయో తెలుసుకుంటున్నారు. స్థలాల క్రమబద్ధీకరణ పారదర్శకంగా చేపట్టేందుకు జిల్లా కలెక్టర్ ఇప్పటికే పలుమార్లు సమీక్షలు చేశారు. మున్సిపల్, పంచాయతీ అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ప్రస్తుతం రెగ్యులర్ చేసే ప్లాట్ల వివరాలకు సంబంధించి ఫీజు ఎంత మేరకు నిర్ణయించారో తెలుసుకునేందుకు, స్థలాల యజమానులు తమ ఫోన్ నంబర్లతో మీసేవలో విచారణ చేస్తే ఎంతమేరకు ప్రభుత్వం ఫీజు విధించిందో తెలుసుకోవచ్చు.

రెగ్యులర్ కాని ప్లాట్లతో పాట్లే

ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా క్రమబద్ధీకరించుకోని స్థలాల యజమానులు భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. అధికారులు సూచించిన విధంగా ఆన్‌లైన్‌లో వచ్చే ఫీజును చెల్లించని పక్షంలో, భవిష్యత్‌లో అక్కడ నిర్మాణాలకు అనుమతులు లభించవు. క్రమబద్ధీకరించని స్థలాల్లో ఎలాంటి రిజిస్ట్రేషన్లకు, నిర్మాణాలకు అనుమతులు ఉండబోవు. జిల్లాలో ప్రస్తుతం 8,713 దరఖాస్తులు వివిధ దశల్లో పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

యజమానులపై భారం

ప్లాటు కొనుగోలు చేసిన యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణతో భారం మోసే పరిస్థితులు వచ్చాయి. అక్రమ లేఅవుట్లు వేసిన వారి వద్ద ఎలాంటి విచారణ చేయకుండా, ముఖ్యంగా డీటీసీపీ అనుమతులు ఉన్నాయో, లేదో చూసుకోకుండా ప్లాట్లు కొని పాట్లు పడుతున్నారు. రియల్ వ్యాపారులు, వెంచర్ల యజమానులు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లింపులు చేసే పరిస్థితుల్లో లేరు. వారు బాగానే ఉన్న, ప్లాట్లు కొన్న తామే ఇబ్బందులు పడే పరిస్థితి వచ్చిందని వాపోతున్నారు. 150 గజాల స్థలం ఉన్న వారికి సుమారు రూ.20వేల నుంచి రూ.25వేల వరకు ఫీజు వస్తుందని భావిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి క్రమబద్ధీకరణ ఒక మార్గం కాగా, ప్లాట్లు కొన్నవారే అంతిమంగా నష్టపోతున్నారు.

సమాచారం ఇస్తున్నాం



ముస్తాబాద్‌లో 757 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు వచ్చాయి. అందరికీ సమాచారం ఇస్తున్నాం. పంచాయతీలోనే ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశాం. అప్పటికప్పుడే నిర్మాణాలకు అనుమతులు ఇస్తాం.

– రమేశ్, ముస్తాబాద్ మేజర్ పంచాయతీ ఈవో

వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి



డీటీసీపీ అనుమతులు లేకుండా ప్లాట్లు విక్రయించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి. క్రమబద్ధీకరణకు 25 శాతం రాయితీ ఇవ్వడం మంచిదే. భవిష్యత్‌లో ప్లాట్ల వ్యాపారాలపై మరింత కఠినంగా వ్యవహరిస్తే సామన్యులకు నష్టం జరుగదు.

– లింగం, ముస్తాబాద్

సరిపడా నీరు తాగాలి

- అవసరమైతేనే బయటకు వెళ్లాలి
- మార్చి నుంచే మండుతున్న ఎండలు
- వడదెబ్బకు గురైతే వెంటనే చికిత్స తీసుకోవాలి
- వృద్ధులు, పిల్లలు జాగ్రత్తలు పాటించాలి
- 'సాక్షి'తో డీఎంహెచ్‌వో రజిత



సిరిసిల్లటౌన్: 'ఈసారి మార్చి ఆరంభం నుంచే ఎండలు దంచికొడుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో అనారోగ్య సమస్యలు ఎక్కువయ్యే అవకాశం ఉంది. ఇప్పటినుంచి జూన్ మాసం ప్రథమార్థం వరకు సూర్యతాపం కొనసాగే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో ప్రజలు తగినంత నీటిని తీసుకుంటూ, శరీర ఉష్ణోగ్రతలు పెరగకుండా చూసుకోవాలి' అని డీఎంహెచ్‌వో డాక్టర్ రజిత పేర్కొన్నారు. వేసవిలో ఎదురయ్యే అనారోగ్య సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంగళవారం 'సాక్షి'కి వివరించారు.

శరీర ఉష్ణోగ్రత పెరిగితే..

ఎండలు ఎక్కువైనప్పుడు శరీర ఉష్ణోగ్రత అధికంగా పెరుగుతుంది. దీంతో శరీరంలో నీరు బాగా పోవడం వల్ల డీహైడ్రేషన్ (నిర్జలీకరణ)తో పాటుగా జీర్ణకోశ సంబంధిత వ్యాధులు, విరేచనాలు, గుండెలయలో మార్పులు, రక్తపోటు(బీపీ)లో హెచ్చుతగ్గులు, మూత్రపిండాల్లో రాళ్లు, మూత్రనాళ సమస్యలు, వేడి దద్దుర్లు(హీట్ ర్యాషెస్) వచ్చే అవకాశం ఉంటుంది.

తగినంత ఆక్సిజన్ అవసరం

వేసవిలో సాధారణంగా మూత్రపిండాల్లో రాళ్ల సమస్య ఎక్కువగా ఉంటుంది. శరీరానికి సరిపడా నీరు తాగకపోవడంతో పాటు, గాలిలో తేమశాతం తక్కువగా ఉండి శరీరం నుంచి బయటకు ఎక్కువగా విసర్జిస్తుంది. దీంతో పలురకాల సమస్యలు వస్తాయి. మన శరీరంలో కండరాలకు తగిన ఆక్సిజన్ అవసరం. ఉష్ణోగ్రతల ప్రభావంతో శరీరంలో నీరు తగ్గినప్పుడు కండరాలు పట్టేస్తాయి. కండరాలకు శరీరం నుంచి తగిన ఆక్సిజన్ అందనప్పుడు ఇతర మార్గంలో అవసరాలు తీర్చుకునే క్రమంలో ల్యాక్టిక్ యాసిడ్ ఉత్పత్తి చేస్తాయి. దీంతో కిడ్నీలపై ప్రభావం చూపి ఫెయిల్ అయ్యే అవకాశం ఉంటుంది. నీళ్ల విరేచనాలతో కూడా కిడ్నీలు పాడవడానికి అవకాశం ఉంటుంది.

దీర్ఘకాలిక రోగులు జాగ్రత్తగా ఉండాలి

బీపీ వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలి. అవసరమైతే డాక్టర్‌ను సంప్రదించి వారి సూచనలను పాటించాలి. వేసవిలో వచ్చే అనేక అనారోగ్య సమస్యలకు తలనొప్పి తొలి హెచ్చరికగా భావించాలి. వెంటనే తగ్గకుంటే డాక్టర్‌ను సంప్రదించాలి. ఈకాలంలో ఒత్తిడి, నిద్రలేమి, చికాకు, ఉత్సాహం తగ్గడం, నీరసించిపోవడం వంటి లక్షణాలు చాలా మందిలో కనిపిస్తాయి.

సాధారణ నీరు.. వ్యాయామం

వేసవిలో అతిచల్లని నీటిని అస్సలు తాగొద్దు. అతిగా వ్యాయామం కూడా చేయడం సరికాదు. తగిన విరామంతో సరిపడా నీరు తీసుకుంటూ వ్యాయామం చేయాలి. ఇక చల్లని నీటితో స్నానం చేయడం, శరీర భాగాలను కడుక్కోవడం సరికాదు. ఎండల్లో తిరిగొచ్చిన వారు ఒక్కసారిగా చల్లని నీటిని తాగితే.. స్నానం చేస్తే రక్తనాళాలు కుచించుకుపోయే అవకాశం ఉంటుంది. దీంతో గుండెపోటుకు గురయ్యే అవకాశాలుంటాయి. కాబట్టి ఎండ నుంచి వచ్చిన వారు సాధారణ నీరు తాగడం శ్రేయస్కరం. చల్లని నీరు, రసాలు తీసుకోవడంతో గొంతు నొప్పి, ఇతర సమస్యలు వస్తాయని గుర్తుంచుకోవాలి.

జాగ్రత్తలు..

రోజూ ఎండలో కాకుండా నీడ ప్రదేశాల్లో ఉండేందుకు ప్రాధాన్యం ఇవ్వాలి. శరీర ఉష్ణోగ్రతలు పెరగకుండా నీరు తాగాలి. ద్రవపదార్థాలు ఎక్కువ తీసుకోవాలి. సీ విటమిన్ పుష్కలంగా ఉండే పదార్థాలు, మజ్జిగ, ఓఆర్‌ఎస్ వంటివి తీసుకోవాలి.

ఇక కాటన్, పలుచటి వస్త్రాలు ధరించడం మంచిది. పనికి వెళ్లిన వారు ఏకధాటిగా ఎండలో ఉండకుండా మధ్యలో విరామం ఇవ్వాలి. మండుటెండలకు బయటకు వెళ్లకుండా ఉండటం శ్రేయస్కరం. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలి. వేసవిలో ఆహార పదార్థాలు త్వరగా చెడిపోతుంటాయి. వాటిని తీసుకుంటే అనారోగ్యాన్ని పొందడం ఖాయం. తాజా ఆహారమే తీసుకోవాలి.

వడదెబ్బకు గురైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వడదెబ్బకు గురైన వ్యక్తులను చల్లని ప్రదేశాల్లో ఉంచాలి. సాల్టెడ్ బటర్ మిల్క్ లేదా గ్లూకోజ్ వాటర్‌తో పాటు పుష్కలంగా నీటిని తీసుకోవాలి. వడదెబ్బతో బాధపడుతున్న వ్యక్తులను చల్లటి నీటితో స్పాంజ్ చేయాలి. అయినా మెరుగుదల కనపడకపోతే వెంటనే ఆసుపత్రికి తరలించాలి. అర్హత గల వైద్యుడితో చికిత్స పొందాలి. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా మెరుగైన వైద్యసేవలు పొందవచ్చు.

జిల్లా రుణ ప్రణాళిక రూ.3,948.01 కోట్లు

- వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేసిన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



జిల్లా వార్షిక రుణ ప్రణాళిక విడుదల చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



జ్యోతిబాపూలే గురుకులంలో వంటశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

సిరిసిల్ల: జిల్లా వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మంగళవారం కలెక్టరేట్‌లో విడుదల చేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో వార్షిక రుణ ప్రణాళికను నాబార్డు అంచనాల మేరకు రూ.3,948.01 కోట్లుగా నిర్ధారించారు. జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు(నాబార్డు) జిల్లాలోని బ్యాంకులకు ఈ ఏడాది రూ.3,203 కోట్ల రుణ సాయాన్ని అందించాలని లక్ష్యంగా నిర్దేశించింది. గతేడాది లక్ష్యంతో పోల్చితే ఇది 23 శాతం అధికమని వార్షిక నివేదికలో పేర్కొన్నారు. 2025–26 సంవత్సరానికి సంబంధించి పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్(పీఎల్‌పీ)ను విడుదల చేశారు. ఇందులో అగ్రభాగం వ్యవసాయ రంగానికి రూ.3,189.07 కోట్లు కేటాయించగా, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు రూ.612.30కోట్లు, ఎగుమతుల రంగానికి రూ.3.20కోట్లు, విద్యా రుణాలకు రూ.28.0కోట్లు, గృహనిర్మాణాలకు రూ.40.04 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలకు రూ.10.80 కోట్లు, పునరుత్పాదక ఇంధన రంగానికి రూ.31.10 కోట్లు ఇతర రంగాలకు కలిపి రూ.33.50 కోట్ల రుణాలను అందించి జిల్లా ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాబార్డు జిల్లా అభివృద్ధి మేనేజర్ ఎం.దిలీప్ చంద్ర, డీఆర్‌డీవో బి.శేషాద్రి, లీడ్ జిల్లా మేనేజర్ టీఎన్ మల్లికార్జునరావు, జిల్లా సహకార అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధవహించాలి

సిరిసిల్ల: ఉత్తమ బోధనతో పాటు విద్యార్థుల ఆరోగ్యం ఎంతో ముఖ్యమని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. పట్టణంలోని మహాత్మా జ్యోతి బాపూలే బాలికల గురుకులాన్ని మంగళవారం సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అనే వివరాలను తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తనకు తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ఇంటర్, పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులతో మాట్లాడి పరీక్షలు ఎలా రాస్తున్నారు అని అడిగారు. విద్యార్థులతో నిత్యం సాధన చేయించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా దృష్టిలోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. జిల్లాలో 338 మంది విద్యార్థులకు కంటి అద్దాలను పంపిణీ చేశామని డీఎంహెచ్‌వో రజిత వివరించారు. కంటి ఆపరేషన్ అవసరమైన వారిని హైదరాబాద్ సరోజినీదేవి ఆస్పత్రికి పంపించామని పేర్కొన్నారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.సంపత్‌కుమార్, ఆర్‌బీఎస్‌కే. ప్రోగ్రాం ఆఫీసర్ డా.నయీంజహాన్ షేక్, మెడికల్ ఆఫీసర్ కృష్ణవేణి తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి



సమావేశంలో బీజేపీ నాయకులు

వేములవాడ: జిల్లా కేంద్రంలో ఈనెల 16న కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో జరిగే జిల్లా కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి, నియోజకవర్గ ఇన్‌చార్జి వికాస్‌రావు పిలుపునిచ్చారు. మంగళవారం వేములవాడలో సన్నాహక సమావేశం నిర్వహించారు. మహిళా మోర్చా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, నాయకులు రాగుల రాజిరెడ్డి, కారెడ్ల మల్లారెడ్డి, సంతోష్‌రెడ్డి, రాపెల్లి శ్రీధర్, మీరాల్కర్ బాలాజీ, బుర్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు కంట్రోల్ రూం

సిరిసిల్లటౌన్: వేసవిలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు కమిషనర్ సమ్మయ్య తెలిపారు. 78935 93330 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.





బద్దిపోచమ్మకు బోనం

వేములవాడ: రాజన్నకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు మంగళవారం బద్దిపోచమ్మకు బోనం సమర్పించారు. మండుతున్న ఎండలకు ఉక్కపోతతో ఇబ్బందులుపడ్డారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య



విద్యార్థులకు కంటి అద్దాలు అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ముందుకుసాగుతుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మంగళవారం వేములవాడ పట్టణంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, రాష్ట్రంలోని ప్రతీ పేద విద్యార్థికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షల్లో కంటి సమస్యలు గుర్తించి అద్దాలు అందజేస్తున్నామని వివరించారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదివి తల్లిదండ్రుల ఆశాయలను నెరవేర్చాలన్నారు. రానున్న పదో తరగతి పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం చేయాలి



మాట్లాడుతున్న డీఆర్‌డీవో శేషాద్రి

సిరిసిల్ల: సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలపై అందరినీ అప్రమత్తం చేయాలని డీఆర్‌డీవో శేషాద్రి అన్నారు. మంగళవారం జిల్లా సమాఖ్య ఆఫీస్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బంది మహిళా సంఘాల సభ్యులు, వీవోలతో సమావేశం నిర్వహించినప్పుడు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలన్నారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే మోసపూరిత మెస్సేజీలకు స్పందించవద్దని సూచించారు. పిల్లల అక్రమ రవాణా, యువతులకు ప్రలోభాలకు గురి చేయడం, వ్యభిచార గృహాలకు అమ్మేసే ఘటనలపై అప్రమత్తంగా ఉండాలని సమాజంలోని ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా చెప్పాలన్నారు. సమావేశంలో ఏపీడీ గొట్టె శ్రీనివాస్, డీపీఎంలు సుధారాణి, పద్మయ్య తదితరులు పాల్గొన్నారు.

26న అర్ధవార్షిక మహాసభ



మాట్లాడుతున్న చైర్మన్ లక్ష్మీనారాయణ

సిరిసిల్లటౌన్: అర్బన్‌బ్యాంకు సభ్యులు తమ వాటాధనంపై రావాల్సిన డివిడెండ్ మొత్తాన్ని పొందాలని సిరిసిల్ల అర్బన్‌బ్యాంకు చైర్మన్ రాపెల్లి లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ, ఈనెల 26న బ్యాంకు అర్ధవార్షిక మహాసభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. సభ్యులు తమ ఖాతాలను ఆధార్, పాన్‌కార్డులతో అప్‌డేట్ చేసుకోవాలని కోరారు. ఉపాధ్యక్షుడు అడ్డగట్ల మురళి, డైరెక్టర్లు గుడ్ల సత్యానందం, చొప్పదండి ప్రమోద్, పాటి కుమార్‌రాజు, బుర్ర రాజు, వేముల సుక్కమ్మ, అడ్డగట్ల దేవదాసు, ఎనగందుల శంకర్, వలసు హరిణి, పత్తిపాక సురేశ్, కోడం సంజీవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కాలువలోపడి వ్యక్తి మృతి


మానాల వెంకటేశ్(ఫైల్)

గోదావరిఖని: మల్కాపూర్ గ్రామానికి చెందిన మానాల వెంకటేశ్(47) మంగళవారం ప్రమాదవశాత్తు మురుగునీటికాలువలోపడి మృతి చెందాడని వన్‌టౌన్ ఎస్సై రమేశ్ తెలిపారు. ఉదయం పని కోసం స్కూటీపై వెళ్తూ అదుపుతప్పి కాలువలో పడి మృతి చెందాడు. మృతుడి భార్య స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య


అంజయ్య మృతదేహం

మానకొండూర్: మండలంలోని పోచంపల్లికి చెందిన పొలం అంజయ్య (53) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పొలం అంజయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తల్లి 15 ఏళ్ల క్రితం చనిపోయింది. అప్పటి నుంచి అంజయ్య ఆరోగ్య పరిస్థితి బాగోలేదు. కుటుంబ సభ్యులు అతడి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడేందుకు పలు ఆస్పత్రులు తిరిగి వైద్యం చేయించారు. రెండు నెలలనుంచి మళ్లీ అంజయ్య ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున అంజయ్య ఇంట్లో కనిపించకపోవడంతో కుమారుడు రఘు తండ్రి కోసం వెతకగా ఇంటి ముందు చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అనారోగ్యంతో ఒకరు..


నర్సింహాచారి (ఫైల్)

సైదాపూర్: మండలంలోని ఆకునూర్ శివారు భూషణగట్ల వద్ద బండోజు నర్సింహాచారి(50) చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సైదాపూర్ ఎస్సై తిరుపతి వివరాల ప్రకారం .. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన బండోజు నర్సింహాచారి అనారోగ్య సమస్యలతో జనవరి 7న హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి వెళ్లాడు. చికిత్సకు సుమారు రూ.5లక్షలు అవుతుందని వైద్యులు తెలిపారు. అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలని మనస్తాపం చెందాడు. ఆ మర్నాడు రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. నర్సింహాచారి కనిపించడం లేదని హుస్నాబాద్ పోలీసులకు ఆయన కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు. సైదాపూర్ మండలం ఆకునూర్ శివారు భూషణగట్ల వద్ద చెట్టుకు ఉరేసుకొని చనిపోయాడని సర్వాయిపేట గ్రామానికి చెందిన దేవయ్య మంగళవారం ఇచ్చిన సమాచారంతో కుటుంబసభ్యులు నర్సింహాచారి మృతదేహంగా గుర్తించారు. నర్సింహాచారికి ముగ్గురు కూతుర్లు ఉన్నారు. చిన్న అల్లుడు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

జ్వరంతో బాలిక మృతి


రమ్య (ఫైల్)

హుజూరాబాద్ : మండలంలోని చెల్పూర్ గ్రామానికి చెందిన బండారి రమ్య (14) తీవ్ర జ్వరంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందింది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... రమ్య గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. 20 రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా హన్మకొండలోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సోమవారం రాత్రి తీవ్ర జ్వరంతో బాధపడుతూ మంగళవారం ఉదయం మృతిచెందింది. రమ్య తండ్రి బండారి పెద్ద రమేశ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.


స్వామివార్ల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


హాజరైన కలెక్టర్, ఎస్పీ, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, అడ్లూరి లక్ష్మణ్

కల్యాణం.. కమనీయం

- పట్టువస్త్రాలు సమర్పించిన ప్రభుత్వ విప్ అడ్లూరి..
- జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్
- హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ప్రముఖులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణవేడుకలను అశేషభక్తుల మధ్య మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద బ్రాహ్మణులు స్వామివారి కల్యాణ వేడుకలను ఉదయం నుంచే ప్రారంభించారు. రాష్ట్రనలుమూలలతోపాటు వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులతో శ్రీమఠంస్థలం కిక్కిరిసి పోయింది. స్వామివారలకు ప్రభుత్వం తరపున స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ పట్టువస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. ఇసుక స్తంభం నుంచి దేవాలయం వరకు మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్లారు. ముందుగా ప్రధాన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందించారు. వేడుకల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.




వేడుకను తిలకిస్తున్న భక్తులు


పట్టువస్త్రాలు తెస్తున్న కలెక్టర్ దంపతులు


పట్టు వస్త్రాలతో విప్ అడ్లూరి లక్ష్మణ్

తప్పిన తలనీలాల భారం

- కాంట్రాక్టర్‌కు అప్పగింత
- ప్రభుత్వ అనుమతితో రూ.2.50 కోట్లు చెల్లింపు



వేములవాడ: రాజన్నకు సిరులు కురిపించే కురులు కొద్ది రోజులుగా ఆలయ అధికారులకు అవస్థలు తెచ్చిపెడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆశించిన రేటు లేక రెండేళ్ల కోసం కాంట్రాక్టు తీసుకున్న ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ కొద్ది నెలలుగా పత్తాలేకుండా పోయింది. చేసేదేమీ లేక ఆలయ అధికారులు తలనీలాలను సేకరిస్తూ కల్యాణకట్టలోనే ఓ మూలన భద్రపరిచారు. ఈ క్రమంలో 'కల్యాణకట్టలో దుర్వాసన', 'తలనీలాల సంచుల్లోంచి తెల్లపురుగులు' అంటూ 'సాక్షి' కథనం ప్రచురించింది. స్పందించిన అధికారులు స్వామివారి ఓపెన్‌స్లాబ్‌పై ఆరబెట్టారు. అప్పట్నుంచి కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేస్తూనే ఉన్నారు. ముందస్తుగా ఆలయ అధికారుల వద్దనున్న చెక్‌లతో కేసులు నమోదు చేశారు. దీంతో దిగొచ్చిన కాంట్రాక్టర్ రూ.2.50 కోట్లు చెల్లించినట్లు ఈవో వినోద్ రెడ్డి తెలిపారు. అందరి సమక్షంలో సదరు కాంట్రాక్టర్‌కు తలనీలాలను అప్పగించినట్లు చెప్పారు. అయితే ఇందుకు ప్రభుత్వం నుంచి ప్రత్యేక జీవో విడుదలైందనివో ప్రకారం తాము కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకున్నట్లు చెప్పారు. అగ్రిమెంట్ ప్రకారం తమకు రావాల్సిన రూ.19 కోట్లు కాంట్రాక్టర్ రాజన్నకు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

రూ.19 కోట్లకు టెండర్.. ఏప్రిల్ 11 వరకు గడువు

కల్యాణకట్టలో భక్తులు సమర్పించుకునే తలనీలాలను సేకరించుకునేందుకు రూ.19 కోట్లకు ఏప్రిల్ 1, 2023 నుంచి ఏప్రిల్ 11, 2025 రెండేళ్ల కోసం ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సుమిత్ ఎంటర్‌ప్రైజెస్ కాంట్రాక్టు తీసుకున్నారు. ఏడాదిపాటు సక్రమంగా నిర్వహించిన సదరు కాంట్రాక్టర్ కొద్ది నెలలుగా పత్తాలేకుండా పోయాడు. రూ.19 కోట్లలోంచి కాంట్రాక్టర్ రూ. 9 కోట్లు మాత్రమే చెల్లించి ఆరు చెక్కులను ఆలయ అధికారులకు ఇచ్చారు. ఇందులోంచి మూడు చెక్కులు బౌన్స్ కాగా, కాంట్రాక్టర్‌పై కేసు నమోదైంది. అయినా కాంట్రాక్టర్ నుంచి ఆశించిన ఫలితం రాక ఆలయ సిబ్బంది పర్యవేక్షణలో తలనీలాల సేకరణ చెపట్టారు. ఈక్రమంలో కాంట్రాక్టర్ నుంచి రావాల్సిన రూ.10 కోట్లలో రూ.2.50 కోట్లు వసూలు కాగా, మిగతా వాటికి అగ్రిమెంట్ చేసుకున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్ నుంచి డబ్బులు వసూలు చేయడం అధికారుల ముందున్న టాస్క్.

టెంటర్లకు ఆదరణ కరువు

రెండేళ్లకోమారు నిర్వహించి తలనీలాలు సేకరణ టెండర్లు మార్చి 31తో ముగుస్తుంది. ఏప్రిల్‌తో ప్రారంభమయ్యే నూతన కాంట్రాక్టుకు సంబంధించి కొద్ది రోజులుగా ఆలయ అధికారులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహారాష్ట్రలో పత్రికా ప్రకటనలు చేశారు. నాలుగుసార్లు టెండర్ నిర్వహించారు. అయినా ఏ ఒక్కరూ టెండర్ వేసేందుకు ముందుకు రావడం లేదని అధికారులు చెబుతున్నారు. ఈనెల 20న మళ్లీ టెండర్ నిర్వహించేందుకు మంగళవారం ప్రకటన జారీ చేశారు. ఇప్పుడైనా కాంట్రాక్టర్లు హాజరవుతారా లేదా అన్నది ప్రశ్నగానే మిగిలింది.

నేటి నుంచి డోలోత్సవం

వేములవాడ: రాజన్న ఆలయంలో బుధవారం నుంచి మూడు రోజులపాటు డోలోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు అర్చకుడు చంద్రగిరి శరత్‌శర్మ తెలిపారు. ఈనెల 16 నుంచి ఐదు రోజులపాటు జరిగే శివకల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో పనులు వేగం పుంజుకున్నాయి. ప్రధానాలయం ముందు యాగశాల సిద్ధం చేస్తున్నారు.

ఇన్‌చార్జి స్థానాచార్యులుగా ఉమేశ్‌శర్మ

రాజన్న ఆలయం ఇన్‌చార్జి స్థానాచార్యులుగా ఉమేశ్‌శర్మను నియమించినట్లు ఈవో కొప్పుల వినోద్ రెడ్డి తెలిపారు. గతనెలలో ఇనచార్జి స్థానాచార్యులుగా కొనసాగిన అప్పాల భీమాశంకరశర్మ రిటైర్డ్ కావడంతో ఏర్పడిన ఖాళీలో ప్రధాన అర్చకులైన ఉమేశ్‌శర్మ నియమించారు.


ఏర్పాటు చేస్తున్న యాగశాల

265 క్వింటాళ్ల పీడీఎస్ రైస్ పట్టివేత

ధర్మారం(ధర్మపురి): నర్సింహులపల్లి గ్రామశివారులో మంగళవారం లారీలో అక్రమంగా తరలిస్తున్న 264.70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై లక్ష్మణ్ తెలిపారు. హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ టీంతోపాటు పెద్దపల్లి సీఎస్ఐ శ్రీనివాస్ సంయుక్తంగా నర్సింహులపల్లి గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈక్రమంలో అటుగా వచ్చిన లారీని ఆపి సోదా చేయగా.. దాదాపు రూ.పది లక్షల 32వేల 330 విలువైన 267.70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభించాయని పేర్కొన్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. పెద్దపల్లి ఆర్ఐ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న మొటం గురువయ్య, ముగ్గు శ్రీనివాస్‌పై కేసు నమోదుచేసినట్లు ఎస్సై వివరించారు.

లే నాన్నా.. అమ్మా, చెల్లి వచ్చాం

- లిఫ్ట్ ప్రమాదంలో సిరిసిల్ల కమాండెంట్ మృతి
- తండ్రి మృతదేహాన్ని చూసి విలవిల్లాడిన కూతురు
- కలెక్టర్, ఎస్పీ నివాళి
- సంతాపం తెలిపిన కేంద్ర మంత్రి బండి, మాజీ మంత్రి కేటీఆర్


గంగారాం(ఫైల్)

సిరిసిల్ల/సిరిసిల్లక్రైం: 'లే నాన్న.. అమ్మా.. చెల్లి వచ్చాం.. ఒక్కసారి చూడండి నాన్న.. మీరే మా ధైర్యం .. ఇలా వెళ్లి పోతే ఎలా.. మీకు ఎన్ని గాయాలు అయ్యాయి.. నాన్న పడిపోతుంటే.. మీరంతా ఉండి ఏం చేస్తున్నారు..!! అంటూ.. సిరిసిల్లలో ప్రమాదవ శాత్తు మృతిచెందిన 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ తోట గంగారాం(61) కూతురు డాక్టర్ గౌతమి కన్నీరు కార్చుతూ విలవిలాడిపోయారు. వివరాలు.. రాజన్న సిరిసిల్ల జిల్లా వెంకట్రావునగర్‌లో రమేశ్ ఇంట్లో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి అద్దెకు ఉంటారు. చంద్రశేఖర్‌రెడ్డి కూతురు ఇటీవల మరణించారు. అతన్ని ఓదార్చేందుకు వారి ఇంటికి వెళ్లిన తోట గంగారాం తిరిగి వస్తుండగా.. లోపల లిఫ్ట్ లేకుండానే గేటు ఓపెన్ కావడంతో అందులో ప్రమాదశాత్తు పడిపోయాడు. మూడో అంతస్తు నుంచి గంగారాం పడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. పోలీస్ సిబ్బంది, ఫైర్ సిబ్బంది తాళ్ల సాయంతో గంగారాంను బయటకు తీయగా అప్పటికే మరణించినట్లు నిర్ధారించారు. లిఫ్ట్ నిర్వహణ లోపమే కారణమని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు సిద్దిపేటకు చెందిన లిఫ్ట్ నిర్మాణ సంస్థ ప్రతినిధిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పోలీస్ బెటాలియన్‌లో..

సిరిసిల్ల శివారులోని సర్దాపూర్ 17వ పోలీస్ బెటాలియన్‌లో కమాండెంట్ మృతదేహాన్ని ఉంచి పలువురు నివాళులు అర్పించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ బెటాలియన్‌కు చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. పుష్పగుచ్ఛం ఉంచి నివాళులు అర్పించారు. అంతకు ముందు రాత్రి ఎస్పీ గిటే మహేశ్ బాబా సాహేబ్, ఏఎస్పీ చంద్రయ్య గంగారాం మృతదేహాన్ని పరిశీలించి నివాలి అర్పించారు. గతంలో హైదరాబాద్ సచివాలయం ఛీఫ్ సెక్యూరిటీ ఆఫీస్(సీఎస్‌వో) గా గంగారాం పని చేశారని, ఆయన మృతిపట్ల సిరిసిల్ల ఎమ్మెల్యే, మాజీ మంత్రి కె.తారక రామారావు సంతాపం తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్ పోలీస్ కమాండెంట్ మృతిపై సంతాపం ప్రకటించారు. బెటాలియన్ పోలీస్ సిబ్బంది కన్నీటి నివాళి మధ్య గంగారాం మృతదేహాన్ని స్వగ్రామం నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సిద్దులంకు తరలించారు.


గంగారాం మృతదేహంపై పడి రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నలుగురు బాలికల అదృశ్యం

- తల్లిదండ్రులకు అప్పగించిన వన్‌టౌన్ పోలీసులు

కరీంనగర్‌క్రైం: నగరానికి చెందిన నలుగురు బాలికలు రెండు రోజుల క్రితం అదృశ్యం అయ్యారు. వారి జాడ గుర్తించిన కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు క్షేమంగా ఇంటికి చేర్చారు. ఈ నెల 09న వన్‌టౌన్ పోలీసులకు నలుగురు బాలికలు అదృశ్యం అయ్యారని ఫిర్యాదు వచ్చింది. దర్యాప్తు చేసిన పోలీసులు గుంటూరులో బాలికలను గుర్తించి కరీంనగర్ తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించారు. బాలికలు తరచూ ఫోన్లు చూస్తుండడంతో మందలించడంతోనే ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

సిరిసిల్లక్రైం: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రం సుందరయ్యనగర్‌కు చెందిన నాయిని రాజయ్య (59) రోడ్డు ప్రమాదంలో మంగళవారం మృతి చెందాడు. పోలీసులు వివరాల ప్రకారం.. రాజయ్య సైకిల్‌పై వెల్జిపూర్ వెళ్తుండగా సిరిసిల్ల బ్రిడ్జి వద్ద వెనకనుంచి బైక్ ఢీకొట్టింది. ఈప్రమాదంలో తీవ్రంగా గాయపడిన రాజయ్యను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రి, అక్కడి నుంచి కరీంనగర్ తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి చిన్న కొడుకు రమేశ్ ఫిర్యాదు మేరకు కోనరావుపేట మండలం నిమ్మపల్లికి చెందిన శీతల్లి మనోహర్‌ను నిందితుడిగా గుర్తించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిరిసిల్ల టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

శంకరపట్నం: శంకరపట్నం మండలంలో వీధికుక్కల దాడిలో మరో బాలుడికి తీవ్రగాయాలు అయ్యాయి. మండలంలోని వంకాయగూడెం గ్రామానికి చెందిన శ్రేయాన్స్(4) ఇంటిఎదుట ఆడుకుంటుండగా వెన్నులో కుక్క కరిచి గాయపర్చింది. తాడికల్‌లో కృత్విక్‌ను కరిచిన కుక్క వంకాయగూడెం వచ్చి శ్రేయాన్స్‌ను కరిచిందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. శ్రేయాన్స్‌కు కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స చేయించారు.

గంజాయి విక్రేతల అరెస్ట్


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

కరీంనగర్‌క్రైం: నగరంలోని హౌజింగ్‌బోర్డుకాలనీలో గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిట్లు కరీంనగర్ త్రీటౌన్ పోలీసులు తెలిపారు. పెట్రోలింగ్ డ్యూటీలో ఉన్న పోలీసు ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద రూ.3000 విలువైప 1.460 కిలోల గంజాయి చాక్లెట్లు లభించినట్లు వెల్లడించారు. నిందితులు ఉత్తరప్రదేశ్‌కు చెందిన మహేశ్‌కుమార్ గౌతమ్‌గా గుర్తించినట్లు పేర్కొన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పరీక్ష రాస్తే విజయమే

తెలంగాణ పబ్లిక్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్–1, 2 ఫలితాల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సత్తాచాటారు. కొందరు అభ్యర్థులు ఇదివరకు గ్రూప్–4 ఫలితాల్లో ర్యాంకులు సాధించి ఆయా శాఖల్లో ఉద్యోగం చేస్తున్నారు. మళ్లీ ఇప్పుడు ఉత్తమ ర్యాంకులు సాధించడం విశేషం.

- వీఆర్వోగా, జూనియర్ అసిస్టెంట్‌గా రాణించిన దివ్య
- గ్రూప్ –2లో ప్రతిభ


దివ్య

ధర్మారం(ధర్మపురి): ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ – 2 ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన మోటపల్లి దివ్య రాష్ట్రస్థాయిలో 169వ ర్యాంక్ సాధించారు. కాళేశ్వరం జోన్ మహిళా విభాగంలో రెండో ర్యాంక్ సాధించారు. బంగారు ఆభరణాల పనిచేసే మోటపల్లి తిరుపతి–భారతి దంపతుల కూతురు దివ్య. బీటెక్ కెమికల్ ఇంజినీరింగ్ చదివారు. 2019లో వీఆర్వోతోపాటు గ్రూప్ – 4 ఉద్యోగం కోసం నిర్వహించిన పరీక్ష రాశారు. తొలుత వీఆర్వో ఉద్యోగానికి ఎంపికయ్యారు. జూలపల్లి మండలంలో పనిచేశారు. గ్రూప్– 4 పరీక్ష ఫలితాలు 2021లో ప్రకటించగా రాష్ట్రస్థాయిలో 47వ ర్యాంక్ సాధించారు. కరీంనగర్ కలెక్టరేట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగానికి ఎంపికయ్యారు. 317 జీవో కింద దివ్యను ధర్మారం తహసీల్దార్ కార్యాలయానికి జూనియర్ అసిస్టెంట్‌గా బదిలీ చేశారు. గ్రూప్ – 1 లక్ష్యంగా ఉద్యోగానికి దీర్ఘకాలిక సెలవు పెట్టిన ఆమె.. రెండు నెలల వ్యవధిలోనే గ్రూప్ –2, గ్రూప్ –1 పరీక్షలు నిర్వహించగా రెండింటికి ప్రిపేరయ్యారు. మంగళవారం విడుదలైన గ్రూప్– 2 ఫలితాల్లో సత్తా చాటారు.

సన్మానించిన తహసీల్దార్

ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దివ్యను మంగళవారం తహసీల్దార్ వకీల్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. దివ్యను శాలువాతో సన్మానించి మిఠాయిలు పంపిణీ చేశారు. తహసీల్దార్ వకీల్, డిప్యూటీ తహసీల్దార్ కుమార్, ఆర్ఐలు వరలక్ష్మి, నవీన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

నిఖిల్‌రెడ్డికి 70వ ర్యాంక్


నిఖిల్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): గ్రూప్–2 మెరిట్‌లిస్టులో సైదాపూర్ మండలానికి చెందిన సంతపురి నిఖిల్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 70వ ర్యాంకు సాధించారు. సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంతపురి నాగిరెడ్డి, జ్యోతి కొడుకు నిఖిల్‌రెడ్డి ప్రస్తుతం కరీంనగర్ జిల్లా ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఇంజనీరింగ్‌లో పట్టభద్రుడైన నిఖిల్‌రెడ్డి ఏ విధమైన కోచింగ్ లేకుండానే ఇంటి వద్దనే సొంతంగా పరీక్షలకు సన్నద్ధమై తొలుత గ్రూప్–4లో పోలీస్‌శాఖలో, రెండోసారి గ్రూప్–4లో ట్రెజరీ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యాడు. మంగళవారం విడుదలైన గ్రూప్–2లో 398.423 మార్కులతో రాష్ట్రస్థాయిలో 70ర్యాంకు సాధించాడు.

గ్రూప్–4లో 26, ఇప్పుడు 24వ ర్యాంక్


రాకేశ్‌గౌడ్

ఇల్లంతకుంట(మానకొండూర్): ఇల్లంతకుంట మండలం అనంతగిరి గ్రామానికి చెందిన గొట్టిపర్తి రాకేశ్‌గౌడ్ గ్రూప్– 2 ఫలితాల్లో 24వ ర్యాంకు సాధించాడు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని రాకేశ్ తెలిపాడు. మూడు నెలల క్రితం ప్రకటించిన గ్రూపు– 4 ఫలితాల్లో 26వ ర్యాంకు సాధించి రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషనరీ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రాకేశ్ ప్రాథమిక విద్యాభ్యాసం ఇల్లంతకుంట మండల కేంద్రంలో, డిగ్రీ, పీజీ హైదరాబాద్‌లో పూర్తి చేశాడు. రెవెన్యూ, మున్సిపల్, కమర్షియల్ అండ్ టాక్సెస్ శాఖల్లో ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రాకేశ్ తండ్రి యాదగిరిగౌడ్ వ్యవసాయం, మోటార్ వైండింగ్ పనులు చేస్తారు.

సత్తాచాటిన భువన


భువన

సిరిసిల్లఎడ్యుకేషన్: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బుర్ర భువన గ్రూప్–1లో 456 మార్కులు, గ్రూప్–2లో 363 ర్యాంకు సాధించింది. గతంలో తెలంగాణ పబ్లిక్ కమిషన్ విడుదల చేసిన గ్రూప్–4లో ఎంపికై ప్రస్తుతం కలెక్టరేట్‌లోని ల్యాండ్ అండ్ రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తుంది. చొప్పదండి జవహర్ నవోదయ పాఠశాలలో చదివి 10జీపీఏ సాధించి, అనంతరం ఎస్ఆర్ కళాశాల హనుమకొండలో ఇంటర్ పూర్తి చేసింది. ఎన్ఐటీ వరంగల్‌లో బీటెక్ పూర్తి చేసి గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో మూడేళ్లు అసిస్టెంట్ ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగానికి రాజీనామా చేసింది. గ్రూప్స్ కోసం చదివి ప్రస్తుతం మెరుగైన ఫలితాన్ని సాధించడంపై కుటుంబీకులు హర్షం వ్యక్తం చేశారు. భువన తండ్రి బుర్ర కృష్ణ ప్రసాద్‌గౌడ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాగా తల్లి ప్రైవేట్ స్కూల్ కరస్పాండెంట్‌గావ్యవహరిస్తుంది.

సాయిప్రశాంత్‌రెడ్డికి 95వ ర్యాంకు


సాయిప్రశాంత్‌రెడ్డి

ఇల్లందకుంట(హుజూరాబాద్): ఇల్లందకుంట మండలకేంద్రానికి చెందిన కాంతాల మల్లారెడ్డి– రజిత దంపతుల కుమారుడు కాంతాల సాయిప్రశాంత్‌రెడ్డి గ్రూప్– 2 ఫలితాల్లో 95వ ర్యాంకు సాధించాడు. సామాన్య వ్యవసాయ కుటుంబానికి చెందిన సాయి ప్రశాంత్‌రెడ్డి గ్రూప్– 4 ఫలితాల్లో 777వ ర్యాంకుతో సత్తాచాటి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ మండలంలో హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సాయి ప్రశాంత్‌రెడ్డి ఉత్తమ ర్యాంక్ సాధించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కూలీ కుటుంబం నుంచి...


మోదుంపల్లి మహేశ్వరి

మానకొండూర్: మానకొండూర్‌కు చెందిన మోదుంపల్లి మహేశ్వరి గ్రూప్–1 ఫలితాల్లో 456 మార్కులు సాధించింది. మోదుంపల్లి శంకరయ్య–శంకరమ్మ దంపతులకు కూతురు మహేశ్వరీ సంతానం. తండ్రి శంకరయ్య మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. నాలుగేళ్ల క్రితం మృతి చెందాడు. తల్లి శంకరమ్మ కూలీనాలి పనులు చేసుకుంటూ కూతురును చదివించింది.

ఆమె మాట్లాడితేనే టవర్ దిగుతా

- హైటెన్షన్ టవర్ ఎక్కి యువకుడి హల్‌చల్
- మహిళ మాట్లాడటంతో కిందకు దిగిన యువకుడు


విద్యుత్ హైటెన్షన్ టవర్‌పై ఉన్న అజయ్


అజయ్‌ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

జ్యోతినగర్(రామగుండం): తనతో చనువుగా ఉన్న ఆమె ఇప్పుడు తనతో మాట్లాడడం లేదని, ఆమె మాట్లాడితేనే టవర్ దిగుతానని, లేదంటే దూకి ఆత్మహత్య చేసుకుంటానని బిహార్‌కు చెందిన వలసకూలీ గేదెం అజయ్ భీష్మించుకు కూర్చున్నాడు. మంగళవారం ఎన్టీపీసీ మేడిపల్లి సెంటర్‌లోని హైటెన్షన్ విద్యుత్ టవర్ పైకి ఎక్కి హల్‌చల్ చేశాడు. సమాచారం అందుకున్న ఎస్సై ఉదయ్‌కిరణ్, ఏసీపీ రమేశ్, సీఐ ప్రవీణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసు అధికారులు మైక్‌సెట్ ద్వారా యువకుడిని సంప్రదించగా.. కొద్దిరోజులుగా ఆ యువతి తనతో మాట్లాడడం లేదన్నారు. స్పందించిన పోలీసులు యువతిని ఘటనా స్థలానికి తీసుకొచ్చి మైక్‌లో మాట్లాడించగా, అజయ్ టవర్ దిగాడు. పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మరోవైపు.. అజయ్ తనను కొంతకాలంగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. కాగా, పోలీసుల అప్రమత్తంగా వ్యవహరించి సదరు యువతిని సంఘటనా స్థలానికి తీసుకొచ్చి మాట్లాడించడంతో యువకుడి ప్రాణాలు దక్కాయి.

బ్లాక్ మెయిల్ చేసిన ముగ్గురి అరెస్ట్

- రూ.80వేల నగదు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

మెట్‌పల్లి: ఇరిగేషన్ శాఖ మెట్‌పల్లి డివిజన్‌లో డీఈఈ లక్కంపల్లి అరుణోదయ్ కుమార్‌ను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు వసూలు చేసిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఎస్సై అనిల్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. రౌడీ షీటర్ బత్తుల భరత్, జెట్టి లక్ష్మణ్, రేంజర్ల అజయ్, ఎన్నం రమేశ్ ముఠాగా ఏర్పడి కొంతకాలంగా అక్రమదందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు. ప్రశ్నించిన వారిపై అట్రాసిటీ కేసు పెడతామంటూ బెదిరిస్తూ అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. గతనెల 12న రేంజర్ల అజయ్ రాజేశ్వర్‌రావుపేటలోని వరద కాలువ నుంచి అక్రమంగా మొరం తరలిస్తుండగా డీఈఈ తమ వర్క్ ఇన్‌స్పెక్టర్ లస్మయ్యతో కలిసి అక్కడకు వెళ్లి అడ్డుకున్నాడు. వెంటనే అజయ్ ఈ విషయాన్ని ఫోన్‌లో రమేశ్‌కు తెలపగా.. అతడు వచ్చి డీఈఈని దూషించడంతోపాటు అట్రాసిటీ కేసు పెట్టిస్తామని బెదిరించాడు. గత్యంతరం లేక డీఈఈ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తర్వాత భరత్ డీఈఈకి ఫోన్ చేసి అట్రాసిటీ కేసు పెట్టకుండా ఉండాలంటే రూ.3లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అలాగే జెట్టి లక్ష్మణ్ కూడా ఫోన్ చేసి సమస్యను పరిష్కరించుకోవాలని, లేకుంటే చంపుతామని బెదిరించాడు. దీనికి భయపడిన డీఈఈ భరత్‌కు ఫోన్‌పే ద్వారా రూ.1.10లక్షలు, లక్ష్మణ్‌కు రూ.40వేలు నేరుగా అందించాడు. అయినా వినకుండా మిగతా డబ్బులు కూడా ఇవ్వాలంటూ తరచూ ఫోన్ చేసి బెదిరించసాగారు. వారి వేధింపులు భరించలేక డీఈఈ ఈనెల 6న ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషనలో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. అప్పటినుంచి పరారీలో ఉన్న నలుగురిలో భరత్, లక్ష్మణ్, అజయ్‌ని జిల్లా సరిహద్దు గండి హనుమాన్ ఆలయ సమీపంలో పట్టుకుని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.80వేలు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు రమేశ్ పరారీలో ఉన్నా డు. సర్కిల్ పరిధిలో పంచాయితీలు, సెటిల్‌మెంట్లు చేస్తూ ప్రజలను బెదిరింపులకు గురిచేయడం మానుకోవాలని, లేకుంటే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.